
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
బుధవారం 1 మే 2024



విశాల్ జనసభకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ



మెదక్ అభివృద్ధికి కాంగ్రెస్సే అడ్డు

సిద్దిపేట-మనోహరాబాద్ రైల్వేలైన్‌కు స్థలమివ్వని రాష్ట్ర ప్రభుత్వం

ఇదీ రేవంత్‌కు ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమ..

సంగారెడ్డి-అకోలా, మెదక్-భైంసా హైవేలు వేసింది మేమే

జాతీయ రహదారితో అందోలు, నారాయణఖేడ్, జుక్కల్ సెగ్మెంట్లకు మహర్దశ

'అమృత్ స్టేషన్'గా జహీరాబాద్ రైల్వేస్టేషన్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

జోగిపేట, ఏప్రిల్ 30: ఉమ్మడి మెదక్ జిల్లాను ఎంతగా అభివృద్ధి చేయాలని తాము ప్రయత్నించినా.. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మోకాలడ్డుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అందోలు సెగ్మెంట్ పరిధిలోని అల్లాదుర్గం మండలం చిల్వర్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన బీజేపీ ప్రచార (విశాల్ జన) సభలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉండడంతోనే సంగారెడ్డి-అకోలా హైవేను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. దీంతో రహదారి సౌకర్యం మెరుగుపడి సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్, జుక్కల్ సెగ్మెంట్లు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పూర్తిచేసిన హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారికి అనుసంధానంగా మెదక్-ఎల్లారెడ్డి-బోధన్-భైంసా రోడ్డును కూడా జాతీయ రహదారిగా గుర్తించి విస్తరిస్తున్నామని తెలియజేశారు. ఈ రోడ్డు అభివృద్ధితో మెదక్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌లోని రైల్వేస్టేషన్‌ను అమృత్ రైల్వేస్టేషన్‌గా గుర్తించి తీర్చిదిద్దామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ మాత్రం సహకరించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అందుకే ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసే పనులను రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అడ్డుకుంటున్నదని మోదీ మండిపడ్డారు. మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఆరోపించారు. రైల్వేస్టేషన్లకు స్థలం ఇవ్వడం లేదన్నారు. అలాగే, పొరుగున ఉమ్మడి వరంగల్ జిల్లాలో వనదేవతలైన సమ్మక్క-సారక్కల పేరిట గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నా రేవంత్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడం లేదని ప్రధాని ఆరోపించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి బీబీపాటిల్, మెదక్‌లో పోటీ చేస్తున్న రఘునందన్ రావులను భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థులు బీబీ పాటిల్, రఘునందన్‌రావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, నాయకులు ప్రభాత్, జగదీశ్వర్, గంగా జోగినాథ్, రవిశంకర్, గాజుల నవీన్, సత్యం, జగన్నాథం, పులుగు గోపి, గాజుల అనిల్, ఉల్వల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



జోర్దార్‌గా బీజేపీ సభ

- జనసంద్రంగా మారిన అల్లాదుర్గం
- బీజేపీ శ్రేణుల్లో జోష్

జోగిపేట, ఏప్రిల్ 30: అందోలు సెగ్మెంట్ పరిధిలోని అల్లాదుర్గం మండలం చిల్వర్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన విశాల్ జనసభ బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరైన ఈసభకు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4:53 నిమిషాలకు చిల్వెర చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు నిమిషాల్లో వేదిక పైకి చేరుకున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోతను కూడా లెక్క చేయకుండా వేలాదిగా జనం తరలిరావడంతో మోదీ సంతోషం వ్యక్తం చేశారు. వేదికపై ప్రధానిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మోదీ ప్రసంగించేందుకు సిద్ధమవడంతో మోదీ.. మోదీ.. అంటూ నినాదాలతో సభ దద్దరిల్లింది. మోదీ ప్రసంగాన్ని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తెలుగులోకి అనువదించారు. 45 నిమిషాలు కొనసాగిన ప్రధానమంత్రి ప్రసంగానికి అడుగడుగున జనం హర్షధ్వానాలు, జైశ్రీరాం.. జై మోదీ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

కాషాయమయం

మోదీ సభ కోసం బీజేపీ చేపట్టిన జనసమీకరణతో హైవే మొత్తం కాషాయమయమైంది. బొడ్మట్‌పల్లి నుంచి అల్లాదుర్గం వరకు సుమారు ఆరు కిలోమీటర్లమేర ట్రాఫిక్‌జాం ఏర్పడింది. అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ సెగ్మెంట్లతో పాటు మెదక్ నియోజకవర్గ పరిధిలోని మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్ల నుంచి భారీగా జనాలను తరలించారు. బీజేపీ సభలకు అందోలు నియోజకవర్గంలో ఎప్పుడూ రానంత జనాలు ఈసారి రావడంతో జహీరాబాద్ అభ్యర్థి బీబీపాటిల్, మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు, సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.



అభ్యర్థులతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

మైక్రో అబ్జర్వర్లు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

- మెదక్ లోక్‌సభ ఎన్నికల పరిశీలకుడు సమీర్ మాధవ్ కర్కోటి



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు సమీర్ మాధవ్ కర్కోటి, పక్కన కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 30: మైక్రో అబ్జర్వర్లు పకడ్బందీగా ఎన్నికల విధులను నిర్వర్తించాలని మెదక్ లోక్‌సభ ఎన్నికల పరిశీలకుడు సమీర్ మాధవ్ కర్కోటి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమీర్ మాధవ్ కర్కోటి పర్యవేక్షణలో మైక్రో అబ్జర్వర్స్ 2వ ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.మనుచౌదరి నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గానికి ఐదుగురు, దుబ్బాక నియోజకవర్గానికి 24 మంది, గజ్వేల్ నియోజకవర్గానికి 29 మంది, హుస్నాబాద్ నియోజకవర్గానికి 26 మంది మైక్రో అబ్జర్వర్లను అదనంగా కేటాయించి వారితో మాట్లాడారు. అలాగే జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల ఏఆర్వోలు, ఎన్నికల నిఘా విభాగాల నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులందరూ కృషి చేయాలని ఎన్నికల పరిశీలకుడు సమీర్ మాధవ్ కర్కోటి సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల వేళ కోడ్ ఉల్లంఘన జరగకుండా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న విధులను ఆయా బృందాల నోడల్ అధికారులు వివరించారు. జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటును వేసే విధంగా ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నిఘా బృందాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ విధుల్లో ఉన్న వారు ఓటింగ్‌కు ఒకరోజు ముందు సాయంత్రం 4గంటల లోపే చేరుకుని అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్‌ఆఫీసర్లు, పోలింగ్ సిబ్బంది వచ్చేలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం మీడియా సెంటర్, ఎంసీఎంసీ, సీ-విజిల్, 1950 కాల్ సెంటర్, నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సెల్ ఇంటిగ్రేటెడ్ సెల్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, మైక్రో అబ్జర్వర్స్ నోడల్ అధికారి ఎల్డీఎం సత్యజిత్, డీపీవో దేవకీదేవి, డీపీఆర్వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

పది ఫలితాల్లో అదే జోరు

98.65 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా రెండోస్థానం

- ఈసారి కూడా బాలికలదే పైచేయి
- 100 శాతం ఉత్తీర్ణతతో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 30 : పదోతరగతి ఫలితాల్లో ఈసారి కూడా సిద్దిపేట జిల్లా విద్యార్థుల జోరు కొనసాగింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు సత్తాచాటారు. జిల్లావ్యాప్తంగా 98.65 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా రెండోస్థానంలో నిలిచింది. గతేడాది కూడా 98.65 ఫలితాలతో రెండోస్థానంలో నిలవడం గమనార్హం. ఈసారి జిల్లావ్యాప్తంగా 13,976 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13,788 విద్యార్థులు (98.65శాతం) ఉత్తీర్ణత సాధించారు.



విజయసంకేతనం చూపిస్తున్న ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



మూడుసార్లు అగ్రస్థానంలో జిల్లా

2021-22లో పదోతరగతి ఫలితాల్లో 97.85శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం సాధించింది. 2022-23లో 98.65శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానం దక్కించుకుంది. 2021-22లో ఉత్తీర్ణత శాతం కన్నా 2022-23లో ఉత్తీర్ణత శాతం పెరిగినప్పటికీ రాష్ట్రంలో ఒక ర్యాంకు మాత్రం తగ్గింది.

బాలికలదే హవా

ఈసారి పదోతరగతి ఫలితాల్లో బాలురతో పోలిస్తే బాలికలే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించారు. 7,030 మంది బాలురులు పరీక్ష రాయగా 6,928 మంది (98.44శాతం) ఉత్తీర్ణత సాధించారు. 6,946 మంది బాలికలు పరీక్ష రాయగా 6,868 మంది (98.88శాతం) ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కూడా బాలికలే సత్తా చాటారు. గత సంవత్సర ఫలితాల్లో బాలురు 98.21శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 99.07శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రత్యేకత నిలుపుకున్న ఇందిరానగర్ పాఠశాల

రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలుగాంచిన సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. గత సంవత్సరం 253 మంది విద్యార్థులకు 250 మంది (99.01శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇక ఈ సారి 231 మంది విద్యార్థులకు 230 మంది (99.03 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరం ముగ్గురు విద్యార్థులకు 10 జీపీఏ పాయింట్లు రాగా, ఈ సారి నలుగురు విద్యార్థులకు 10 జీపీఏ పాయింట్లు వచ్చాయి.

238 స్కూళ్లలో 100 శాతం

ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రభంజనం సృష్టించాయి. జిల్లాలో 227 జిల్లా పరిషత్ పాఠశాలలు, 14 ఆదర్శ పాఠశాలలు, 22 కస్తూర్బా పాఠశాలలు, 36 వివిధ యాజమాన్యాలకు సంబంధించిన గురుకులాలు ఉన్నాయి. వీటిలో 238 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. గత సంవత్సరం 219 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి . గత సంవత్సర ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా 126 మందికి 10 జీపీఏ పాయింట్లు రాగా, ఈసారి 153 మంది విద్యార్థులకు 10 జీపీఏ పాయింట్లు వచ్చాయి.

జిల్లా గౌరవాన్ని నిలబెట్టారు

- హరీశ్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

మరోసారి సిద్దిపేట జిల్లా గౌరవాన్ని నిలబెట్టారని పదోతరగతి విద్యార్థులను హరీశ్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కలెక్టర్, విద్యాశాఖకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. మీ బిడ్డను డాక్టర్‌ను చేస్తవా.. మీ కొడుకును ఇంజనీర్‌ను చేయ్ అంటూ ముచ్చటించారు. మరి దావత్ ఎప్పుడు ఇస్తరు.. మీ ఇంటికి ఎప్పుడు రావాలి అంటూ వారితో ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.



10 జీపీఏ సాధించిన విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న ఉపాధ్యాయుడు



జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఏం మొహం పెట్టుకుని సిద్దిపేటకు వస్తావు?

- ఓట్లు అడిగే నైతికత రేవంత్‌రెడ్డికి లేదు
- జిల్లా అభివృద్ధిని అడ్డుకున్న రఘునందన్‌రావు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

7 లో..

ఎర్రని పూలు కనుల విందు

అక్కన్నపేట మండల కేంద్రం నుంచి హుస్నాబాద్ వరకు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న ఎర్రని పూల చెట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులు, బాటసారులు ఆ పూల చెట్ల వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు.

- అక్కన్నపేట, ఏప్రిల్ 30





తాగు నీటి సమస్య లేకుండా చూడాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 30: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వెల్దుర్తి ఎంపీపీ స్వరూప సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికార సరఫరాను పరిశీలించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మీకి సూచించారు. మండలంలో 23 అమ్మ ఆదర్శ పాఠశాలలు మంజూరయ్యాయని, పాఠశాలలో మౌలిక వసతులకు, మరమ్మతులకు రూ.86లక్షల 50వేలు మంజూరైనట్లు ఎంఐఎస్ కోఆర్డినేటర్ నవీన్ తెలిపారు. విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఏఈ వెంకటేశ్వర్లు చెప్పారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో 4వేల మంది కూలీలు పనిచేస్తున్నారని ఏపీవో రాజు తెలిపారు. కుకునూర్ గ్రామ ప్రత్యేక అధికారి రాజేందర్ గ్రామానికి రావడం లేదని, గ్రామంలో నీటి సమస్య ఉందని జడ్పీటీసీ రమేష్‌గౌడ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో జగదీశ్వరచారి అన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఎంపీవో విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప

గొల్పర్తిలో యువకుడి అదృశ్యం



రామాయంపేట, ఏప్రిల్ 30: రామాయంపేట మున్సిపల్ పరిధి గొల్పర్తి ప్రాంతానికి చెందిన కుమ్మరి రాజ్‌కుమార్ అదృశ్యమయ్యాడు. ఏప్రిల్ 20న ఇంటి నుంచి వెళ్లిన రాజ్‌కుమార్ తిరిగిరాలేదు. కుటుంబీకులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా జాడ దొరకలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ న్యాయవాదిని అభినందించిన ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 30: హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేలా కోర్టులో వాదనలు వినిపించిన అదనపు ప్రభుత్వ న్యాయవాది విజయశంకర్‌రెడ్డిని, కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్‌ను సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ మంగళవారం అభినందించారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడినందుకు న్యాయవాదిని అభినందించారు.

ఏం మొహం పెట్టుకుని సిద్దిపేటకు వస్తావు?

● ఓట్లు అడిగే నైతికత రేవంత్‌రెడ్డికి లేదు
● సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్న రఘునందన్‌రావు
● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 30: సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తీసుకుపోయి, నోటికాడి బుక్క లాక్కున్న సీఎం రేవంత్‌రెడ్డి ఏం మొహం పెట్టుకుని సిద్దిపేటకు వచ్చి ఓట్లు అడుగుతారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఆటో క్రెడిట్ యూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆటో కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు హరించివేశారని, అదాని, అంబానీలకు దోచి పెట్టి, దేశంలో ఏ వర్గానికి కూడా న్యాయం చేయని కార్మికుల వ్యతిరేక పార్టీగా బీజేపీపై ముద్ర పడిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వందరోజుల్లో అమలు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రామిసరీ నోట్‌లు, పార్లమెంట్ ఎన్నికల్లో గాడ్ ప్రామిస్‌లు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేస్తే వారి హామీలను ప్రజలు ఆమోదించనట్లు అవుతుందని చెప్పారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి ఆరు గ్యారంటీలతో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయిస్తామన్నారు. రాష్ట్రంలో ఆటో కార్మికుల జీవితాలు కాంగ్రెస్ పాలనలో రోడ్డున పడ్డాయన్నారు. ఆటో కార్మికులు చనిపోతే రేవంత్‌రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదని, కనీసం వారి కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతతో విద్యుత్ సరఫరా చేయలేక ఉద్యోగస్తులను బాధ్యులను చేస్తూ వారికి షోకాజ్ నోటీసులు, బదిలీలు, సస్పెండ్ చేస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్న రఘునందన్‌రావు ఈ ప్రాంత ఓట్లు ఎలా అడుగుతావని ప్రశ్నించారు. సిద్దిపేట అంటేనే బీఆర్ఎస్ గడ్డని హరీశ్‌రావు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పాల సాయిరాం, శ్రీనివాస్ తిరుపతి, లక్ష్మారెడ్డి, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో నిర్వహించిన ఆటో యూనియన్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

జగదేవ్‌పూర్, రాయపోల్, దౌల్తాబాద్‌లో రోడ్ షో

జగదేవ్‌పూర్/రాయపోల్/దౌల్తాబాద్: జగదేవ్‌పూర్, రాయపోల్‌లో నిర్వహించిన రోడ్ షోలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకో పార్టీ మారే గద్దలను రేవంత్‌రెడ్డి ఎత్తుకెవెళ్లి, కాంగ్రెస్ టికెట్లు ఇచ్చారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. విభజన సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి ఓట్లేస్తే గుంపు మేస్త్రీ అయిన రేవంత్‌రెడ్డి గువ్వ పలగాలని చెప్పారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి నీరుగారిచే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కేసీఆర్ జిల్లాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల పేరుతో జిల్లాలను తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, యాదగిరి, మంగమ్మరామచంద్రం, గజ్వేల్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వరశర్మ, ఎంపీపీ పాండుగౌడ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

హవేళిఘణపూర్, ఏప్రిల్ 30: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలోని తిమ్మాయిపల్లిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాయిపల్లికి చెందిన తలారి అజయ్(23) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఉన్న గుడిసెలో తాడుతో ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య రమ్య, తల్లిదండ్రులున్నారు. ఎవరో తన భర్తను ఉరి వేసి చంపారని మృతుడి భార్య ఆరోపిస్తుంది. తగు విధంగా విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు.

కారు, బైకు ఢీకొని వ్యక్తి..

చిలప్‌చెడ్: ఎదురెదురుగా వస్తున్న కారు, బైకు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన పెద్ది మల్లేశం(45) పుల్కల్ గ్రామానికి బీరప్ప పండుగకని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై వస్తుండగా చిట్కుల్ గ్రామ శివారులో మెదక్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో మల్లేశం ఎగిరి పంట పొలాల్లో పడ్డాడు. తలకు తీవ్ర గాయమవడంతో 108 అంబులెన్స్ వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మల్లేశం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరు కారును వదిలేసి, పరారయ్యాడని, కారును స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఏఎస్ఐ మిస్బావుద్దీన్ తెలిపారు. కాగా ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

తెలంగాణలో అత్యధిక సీట్లు బీజేపీవే..

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట, ఏప్రిల్ 30: ధర్మానికి, అధర్మానికి జరుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకుంటుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్ జిల్లా అల్లాదుర్గంలో నిర్వహించిన బీజేపీ జనసభలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మొత్తం మోదీ వైపు చూస్తున్నదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణాలోని 17 సీట్లు గెలిచేందుకు బీజేపీ కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని, వీరి కృషి వల్లనే తాను ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించానని చెప్పారు. తప్పుడు వాగ్దానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిలో బీజేపీపై అవాక్కులు చవాక్కులు పేలుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సంస్కార హీనంగా మాట్లాడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులు బీబీపాటిల్, రఘునందన్‌రావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, గోదావరిఅంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, అరుణతార తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

● జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్


అల్లాదుర్గంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/టేక్మాల్, ఏప్రిల్ 30: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు ఓటు వేయాలని జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ కోరారు. మంగళవారం అల్లాదుర్గంలో నిర్వహించిన బీజేపీ జనసభలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి చేశానన్నారు. దీనికి నిదర్శనమే 161వ జాతీయ రహదారి నిర్మాణం అని చెప్పారు. ప్రధాని మోదీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం నాణ్యమైన, వేగవంతమైన 5జీ నెట్‌వర్క్ అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నారాయణఖేడ్-బీదర్ రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని, పనుల కోసం సర్వే కూడా జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు గత ప్రభుత్వం కేవలం రూ.150 చెల్లిస్తే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం రూ.300 చెల్లిస్తున్నదని చెప్పారు. రైతులను ఆదుకోవడానికి వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203 చెల్లించి మోదీ రైతు బాంధవుడయ్యారన్నారు. జహీరాబాద్ ఎంపీగా తనను మరోసారి గెలిపించాలని బీబీపాటిల్ కోరారు. తనను గెలిపిస్తే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు.

అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్

● కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు
● మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాయికోడ్, ఏప్రిల్ 30: అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ అని, పార్టీకి 125 సంవత్సరాల చరిత్ర ఉన్నదని, కార్యకర్తలు లేనిది పార్టీ లేదని, పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ మండల కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడవకముందే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని, మిగతావి కూడా ఎంపీ ఎన్నికలు అయిపోగానే అమలు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మండలంలో సుమారు రూ.400 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన గుర్తుచేశారు. బొగులంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించామని పేర్కొన్నారు. బుదేరా నుంచి సిరూర్ రోడ్డు నిర్మాణం కోసం రూ.80 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తమ కుటుంబం 62 ఏళ్ల నుంచి గెలిచినా, ఓడినా కాంగ్రెస్‌లోనే ఉంటూ కార్యకర్తలను కాపాడుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఎంపీపీ అధ్యక్షుడు మొగులప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీనర్సింహులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

ప్రజలను మభ్యపెడుతున్న సీఎం

● ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి
● కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది చీకటి ఒప్పందం
● మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు


వర్గల్ మండలం నాచారంలో రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 30: సంక్షేమ పథకాల అమలు పేరుతో ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మభ్యపెడుతున్నాడని మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామంలోని లక్ష్మీనర్సింహ క్షేత్రంలో పూజలు నిర్వహించి, ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాచారం పెద్ద చెరువులో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. మండలంలోని నాచారం, దండుపల్లి, మజీద్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందంతో బీజేపీ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి గతాన్ని మరిచి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపెట్టారని, ప్రజలు నిలదీస్తుంటే బిక్కముఖం వేస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టనుందని ధీమా వ్యక్తం చేశారు. నూతన ఆర్థిక సంస్కరణలతో ప్రపంచ దేశాలు నరేంద్రమోదీని ప్రశంసిస్తుంటే ఇండియా కూటమి నేతలకు నచ్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీ సర్కార్ కట్టుబడి పనిచేస్తుండగా, రిజర్వేషన్ల రద్దు పేరుతో కాంగ్రెస్ ఆయా వర్గాలను రెచ్చగొడుతున్నదని మండిపడ్డారు. అమిత్‌షా అనని మాటలను అన్నట్లుగా చూపెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేసీఆర్ కుటుంబం జైలు పాలు కాక తప్పదన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుండగా కవిత అరెస్టును బీజేపీకి అంటగడుతున్నారని చెప్పారు. రఘునందన్‌రావు వెంట బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, నాయకులు వెంకట్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైరల్ ఫీవర్ పట్ల జాగ్రత్తలు పాటించాలి

● పైలేరియా జిల్లా అధికారి విజేందర్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 30: వైరల్ ఫీవర్ పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పైలేరియా మెదక్ జిల్లా అధికారి విజేందర్ సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైద్యులు గ్రామంలో మంగళవారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. కాళ్లు, నడుము, ఒల్లు నొప్పులు, కళ్లు తిరుగడంతో పాటు జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. గ్రామస్థులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వైద్యాధికారి సాయిసింధు ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేశారు. రోగుల రక్త నమూనాలు సేకరించి, పరీక్షలను నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి పైలేరియా జిల్లా అధికారి విజేందర్ గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టీలు, కులాయిలు శుభ్రం చేయాలని ప్రజలకు సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగాలని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ హారికచ వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

● జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి


మంతూరు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు పీడీ సరస్వతి

నర్సాపూర్, ఏప్రిల్ 30: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేసి, కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని మెదక్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, మంతూరు, కాజీపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు పీడీ సందర్శించారు. అక్కడ ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. సిబ్బంది సకాలంలో ట్యాబ్ ఎంట్రీ చేస్తూ రైతులకు డబ్బులు త్వరితగతిన వారి ఖాతాలో పడేటట్టు చూడాలని సూచించారు. ఆమె వెంట ఏపీఎం గౌరిశంకర్, సీసీ ప్రవీణ, సీఏలు మహేశ్వరీ, జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.

మే డేను బహిష్కరించాలి

● బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: మే డేను బహిష్కరించి, విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినంగా ప్రకటించాలని బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సంగారెడ్డిలో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా మేడేను బహిష్కరించాలని కోరారు. స్వదేశ తిండి తింటూ విదేశీ పాట పాడే వారే మేడేను జరుపుతున్నారని ఎద్దేవా చేశారు. ఉనికి కోసం రాజకీయాల అవసరాల కోసం విదేశీ సిద్ధాంతాలను కార్మిక వర్గంపై రుద్దాలని చూస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎంతో మంది మహోన్నతమైన వ్యక్తులున్నా వాళ్లకు కనిపించదని సకల మానవాళికి ఉపయోగపడేలా పనిముట్లను అందించిన విశ్వకర్మ ఆది దేవుడని అభివర్ణించారు. విశ్వకర్మ జయంతి సెప్టెంబరు 17న కార్మిక దినోత్సవం ప్రకటించే వరకు భారతీయ మజ్దూర్ సంఘ్ పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

సీమా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

కల్హేర్, ఏప్రిల్ 30: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని చాప్టా(కె), ఉజలంపాడ్ సీతారాంతండా గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సీమా ఆంజనేయ, గణపతి, రుక్మిణి, పాండురంగ, దత్తాత్రేయ, శివనాగ నంది, సహిత శిఖర స్థిర యంత్ర ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంటపాల పూజ, మన్యుసూక్త రుద్ర, నవగ్రహ, ఆవాహిత హోమాలు, దాన్యాధి వాసం, శయ్యాది వాసం, ఫలాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వారం రోజుల పాటు అఖండ హరి నామ సప్తాహ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, సాధ్వి భగీరథ బాయి, ఏకాంబ ఆనంద్ మహరాజ్, ధనాసిరి వీరేశ్వర శివాచారి హిరేమట్ పాల్గొంటారని తెలిపారు.

బాదల్‌గాంలో శివపార్వతుల కల్యాణం...


శివపార్వతుల కల్యాణం జరుపుతున్న దృశ్యం

మనూరు: మనూరు మండలం బాదలగాం గ్రామంలోని పంచలింగేశ్వరాలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వైభవంగా శివపార్వతుల కల్యాణం జరిపారు. సద్గురు కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఇంటర్ విద్యార్థుల ఫీజు చెల్లింపునకు రేపటిదాకా గడువు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన వారితో పాటు ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 2వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం కూడా ఈ నెల 2వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా ఆయా తేదీల్లో విద్యార్థులు ఫీజు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులపై కోపంతో కొండగట్టుకు ఆస్తి...

చిన్నకోడూరు, ఏప్రిల్ 30: తనను ఆదరించడం లేదని కుటుంబ సభ్యులపై కోపంతో తన పేరిట ఉన్న ఆస్తిని కొండగట్టు అంజనేయ స్వామి ఆలయానికి ఇవ్వాలనుకున్నాడు ఓ వ్యక్తి. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కప్పెర బాపురెడ్డి కుటుంబ సభ్యులతో గొడవ పడి కొన్నేండ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బాపురెడ్డి తన పేరిట ఉన్న ఆస్తిని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవల కొండగట్టుకు వెళ్లి ఆస్తి పత్రాలను హుండీలో వేస్తుండగా ఆలయ అధికారులు హుండీలో వేస్తే దేవునికి చెందవని చెప్పారు. దీంతో ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేస్తానని తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను బాపురెడ్డి కోరాడు.

తాగు నీటి కోసం మహిళల ధర్నా


చిన్నశంకరంపేటలో ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 30: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో తాగు నీళ్ల దొరకక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి తాగు నీరు లేకపోవడంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉదయం మహిళలు ఖాళీ బిందెలతో చేగుంట-మెదక్ రహదారిపై గంట పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మాట్లాడుతూ.. పైప్‌లైన్ నుంచి మంచినీటి సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పంచాయతీ ఈవో ప్రశాంత్‌కు ఎన్ని పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. వాటర్ మన్ నిర్వాహకంతోనే నీటి సమస్య ఏర్పడుతున్నదని ఆరోపించారు. కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈవో ప్రశాంత్ మంచినీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసనను విరమించారు.

డ్రిప్‌తో వరి సాగు

● ఎకరాకు రూ.15 వేల ఖర్చు, నీటి ఆదా
● ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు కవిత

గుమ్మడిదల, ఏప్రిల్ 30: ఎండలకు భూగర్భ జలాలు అడుగంటుతుడడంతో బోర్ల నుంచి నీళ్లు రాక రబీ సీజన్‌లో వేసిన వరి పొలాలు ఎండుతున్నాయి. అయితే సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన అమ్మగారి కవిత అనే మహిళా డ్రిప్ ద్వారా వరిసాగు చేయడం మంచి ఫలితాలనిచ్చింది. కూరగాయలు సాగు చేసుకొనే పద్ధతిలోనే డ్రిప్ ద్వారా వేసవిలో వరి సాగు చేసి అధిక దిగుబడి సాధించింది. జనవరిలో తనకున్న ఎకరా పది గుంటల్లో డ్రిప్ సహకారంతో వరి సాగు చేసింది. సమయానికి డ్రిప్ ద్వారా వరికి నీటిని సరఫరా అందించి, అధిక దిగుబడి సాధించే దిశగా శ్రమించింది. నేడు వరి పంట పచ్చదనంతో కళకలాడుతుంది. నెల రోజుల్లో ఈ పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. అయితే డ్రిప్ ద్వారా సాగు చేసినందుకు ఎకరా పది గుంటల వరికి రూ.15 వేలు మాత్రమే ఖర్చు చేసినట్లు రైతు తెలిపారు. దుక్కి దున్నడం, నాట్లు వేయడం, కలుపు తీయడం వంటి పనుల భారం నుంచి ఉపసనం పొందినట్లు వివరించారు. సమయం ఆదాతో పాటు నీటి ఆదా కూడా లభిస్తుందని తెలిపారు. తాను సాగు చేసిన ఎకరా పది గుంటల వరి నుంచి రూ.90 వేలకు పైగా ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు కూడా నీటి ఆదా, తక్కువ ఖర్చుతో కూడిన డ్రిప్ ద్వారా వ్యవసాయ సాగుతో శ్రమ లేకుండా ఆదాయం పెంచుకోవాలని కవిత హితువు పలుకుతున్నారు.



పొలం వద్ద ఏర్పాటు చేసిన డ్రిప్ యంత్రం


గుమ్మడిదలలో డ్రిప్ ద్వారా సాగయిన వరి

నాలుగు నెలల్లోనే ప్రభుత్వం విఫలం

● బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

కొండపాక, ఏప్రిల్ 30: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా కొండపాక మండలం గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ వైఫల్యాన్ని తెలిపారు. కాంగ్రెస్ వచ్చి కష్టాలు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతుల ప్రశాంత్, నర్రా జైపాల్‌రెడ్డి, రాగల దుర్గయ్య, నూనెకుమార్ పాల్గొన్నారు.

● **ములుగు:** మండలంలోని దాసర్లపల్లి, అచ్చాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి గణేష్‌గుప్తా, ఎంపీటీసీ నవ్య, రాజేందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ చంద్రం, మాజీ ఉపసర్పంచ్ బాబు, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాపురెడ్డి, పోచయ్య, అశోక్, కనికేష్, దశరథం, భూచక్రం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ములుగు: అచ్చాయిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని 10వ, 9వ వార్డులలో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయనవెంట వైస్‌చైర్మన్ జకీయోద్దీన్, వార్డు కౌన్సిలర్లు అబ్దుల్ రహీం, మామిడి విద్యారాణి, శ్రీధర్, మామిడి శంకర్, స్వామి, కరీం తదితరులున్నారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో జడ్పీటీసీ పంగ మల్లేశంతో కలసి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. వారితో నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ బాల్‌చంద్రం, ఎంపీటీసీ ఆంజనేయులు తదితరులున్నారు.


హుస్నాబాద్: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ ఎంపీ అభ్యర్థి తరఫున..

హుస్నాబాద్, ఏప్రిల్ 30: బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని నాలుగవ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు సాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, ఇంద్రాల సారయ్య, అయిలేని శంకర్‌రెడ్డి తదితరులున్నారు.


కొండపాక: బందారంలో ప్రచారం నిర్వహిస్తున్న రాధాకృష్ణశర్మ, బీఆర్ఎస్ నాయకులు

● **కోహెడ:** మండలంలోని కూరెళ్ల, తీగలకుంటపల్లి, ధర్మసాగర్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెర్యాల దేవేందర్‌రావు, వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, మాజీ జట్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, పెర్యాల లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, వేల్పుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించాలి

● సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్

దుబ్బాక,ఏప్రిల్30: కార్మిక వ్యతిరేక, మనోన్మాద బీజేపీని ఒడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ కోరారు. మంగళవారం దుబ్బాక సీఐటీయూ కార్యాలయం వద్ద ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాద శక్తులకు ఆజ్యం పోస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఒడించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, రాజిరెడ్డి, రాములు, స్వామి, రాజు, నర్సింహులు, సాజిత్ తదితరులున్నారు.



చేర్యాల మునిసిపల్ కార్యాలయ ఆవరణలో చెత్తడబ్బాలు మూలనపడి మూలుగుతున్నాయి. చెత్తను ఆరుబయట ప్రదేశాలలో పారబోయకుండా పట్టణంలోని పలు ప్రధాన ప్రదేశాలలో ఏర్పాటుచేసేందుకు కొన్నినెలల క్రితం డస్ట్‌బిన్స్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. అందుకు వేలాది రూపాయలు వెచ్చించినప్పటికీ, పలు ప్రదేశాలలో ఏర్పాటు చేయకుండా, కార్యాలయ ప్రహరీగోడ పక్కన నిల్వచేయగా నిర్వహణలేక పాడైపోతున్నాయి.

\- చేర్యాల

నాచగిరి హుండీ ఆదాయం రూ.11,38,983

వర్గల్, ఏప్రిల్ 30: మండలంలోని నాచారం గ్రామంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ హుండీని మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ శివరాజ్ ఆధ్వర్యంలో లెక్కించారు. 33 రోజులకు గాను లెక్కించిన హుండీలో రూ.11,38,983 ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. వారితో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్ అన్నపూర్ణ, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ సిబ్బంది, భ్రమరాంబికా సేవా సమితి హైదరాబాద్ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్లీ బర్డ్ స్కీంకు అపూర్వ స్పందన

గజ్వేల్/చేర్యాల, ఏప్రిల్ 30: ఏర్లీ బర్డ్ స్కీంకు అపూర్వ స్పందన లభించిందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి పన్ను మొత్తంపై 5శాతం డిస్కౌంట్‌లో ముందస్తు చెల్లింపు దారులకు అందించగా, రూ.కోటి 29లక్షల 38వేల వసూలు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా గత సంవత్సరం (2023-24)కు సంబంధించిన రూ.72.38 లక్షలను వసూలు చేసినట్లు తెలిపారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా చేర్యాల మునిసిపాలిటీ పరిధిలో రూ.27లక్షలు ఆస్తి పన్ను వసూలు చేసినట్లు ఇన్‌చార్జి కమిషనర్ గొల్కొండ నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలు వ్యాపార, వర్తక దుకాణాలను సందర్శించి ఆస్తి పన్ను వసూలు చేశారు. ఆస్తిపన్నుపై 5శాతం తగ్గుదల అవకాశం మంగళవారంతో ముగిసిందని, 2023-24సంవత్సరంలో రూ.8లక్షలు పన్ను వసూలైందని, ప్రస్తుత సంవత్సరం రూ.27లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, సర్వర్, శ్రీనివాస్, యాదగిరి, గంగాధర్, వెంకటేశ్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

చేర్యాల, ఏప్రిల్ 30: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా గౌడ కులస్థులు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు జరిపి ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణం జరిపారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట, ఐనాపూర్ గ్రామంలో అమ్మవారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐనాపూర్ మాజీసర్పంచు పబ్బోజు విజేందర్ దేవతామూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు.

బీజేపీలో చేరిన వివిధ పార్టీల నాయకులు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

హుస్నాబాద్, ఏప్రిల్ 30: బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ సమక్షంలో కరీంనగర్‌లో మంగళవారం హుస్నాబాద్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు చిట్టి గోపాల్‌రెడ్డి, పందిల్ల మాజీ సర్పంచ్ చిట్టి విజయలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ నెల్లి శ్రీనివాస్, గుల్ల సారయ్య, టీడీపీ నాయకులు కాయిత భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, జయ, కనకచారితో పాటు పలువురు చేరారు. కరీంనగర్ పార్లమెంట్‌లో రెండోసారి తాను గెలువడం ఖాయమని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి అశోక్, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

'సీఎం పర్యటనను జయప్రదం చేద్దాం'

గజ్వేల్, ఏప్రిల్ 30: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేద్దామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మే 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేటలో పర్యటించనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లి సీఎం పర్యటనను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. వారితో హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు మోహన్నగారి రాజు తదితులు ఉన్నారు.

● **సిద్దిపేట టౌన్:** సిద్దిపేట పట్టణంలో వచ్చే నెల 2న జరగనున్న సీఎంరేవంత్‌రెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు 43 వార్డులకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఐదు గ్యారంటీ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, గంప మహేందర్, మార్క సతీష్‌గౌడ్, దేవులపల్లి యాదగిరి, సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, రియాజ్, నరసింహారెడ్డి, ముద్దం లక్ష్మి, దాస అంజయ్య పూజల గోపికృష్ణ, తప్పెట శంకర్, గయాజుద్దీన్, అర్షద్, రషాద్ పాల్గొన్నారు.

ఫలితాల పట్ల పీఆర్టీయూ హర్షం

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 30: పదోతరగతి ఫలితాలలో రాష్ట్రంలో జిల్లాకు ద్వితీయ స్థానం రావడం పట్ల జిల్లా పీఆర్టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శులు శశిధర్ శర్మ ఇంద్రసేనారెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సురేందర్‌రెడ్డి, రాయపోలు మండల శాఖ అధ్యక్షుడు బొల్లం రాజశేఖర్, నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు ఎర్ర పార్థసారథి, అక్బర్ పేట మండల శాఖ అధ్యక్షుడు సిద్ధి వెంకటేష్, మిదుదొడ్డి మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నత విద్యపై విద్యార్థులు దృష్టి సారించాలి'

గజ్వేల్, ఏప్రిల్ 30: విద్యార్థులు డిగ్రీ చదువుతూనే ఉన్నత విద్యపై దృష్టి సారించాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఉమాశశి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఏ తెలుగు ఎంట్రన్స్ కోచింగ్‌ను ఆమె ప్రారంభించారు. వారితో వైస్ ప్రిన్సిపాల్ ఉమారాణి తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, ఏప్రిల్ 30: దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరఫున మండలంలోని వడ్లూరు గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మార్నింగ్‌వాక్‌లో మంగళవారం ప్రచారం చేశారు.

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బెజ్జంకి, తిమ్మయ్యపల్లి తాజా మాజీ సర్పంచులు, మాజీ సర్పంచులతో పాటు పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, టౌన్ ప్రెసిడెంట్ రాజు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


బెజ్జంకి: వడ్లూరులో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

● **కోహెడ:** కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేశ్వరరావుకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం మండలంలోని వింజపల్లి, రామచంద్రాపూర్, వరికోలు, విజయనగరకాలని, నారాయణపూర్, గొట్లమిట్ట, తీగలకుంటపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గజ్వేల్: కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

● **గజ్వేల్:** గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ క్రిస్టియన్ ఫాదర్లు మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఫాక్స్ మాజీ చైర్మన్ వెంకన్నగారి వెంకట్‌నర్సింహ్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారివెంట మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటేరు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారీ, గాడిపల్లి శ్రీనివాస్, అనూప్ తదితరులున్నారు.

అభివృద్ధి, సమన్యాయం బీజేపీతోనే సాధ్యం

● సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్‌రావు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 30: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి, సమన్యాయం సాధ్యమవుతుందని బీజేపీ సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ జాలిగమా ఉపేందర్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డులో బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్, భైరి శంకర్ శివకుమార్,తొడుపునూరి వెంకటేశం, భాష శ్రీకాంత్, రాజిరెడ్డి, రాహుల్, సునీల్ పాల్గొన్నారు.

● **రాయపోల్:** మండలంలోని వడ్డెపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద బీజేపీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు రవి, యాదగిరి, చందు, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.


కోహెడ: మండలంలోని శ్రీరాములపల్లితో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

● **కోహెడ:** మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో ఇంటింటా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మండల ఇన్‌చార్జి ఏనుగుల సందీప్, బూత్ అధ్యక్షుడు చిగురు సంజీవరెడ్డి, గొర్ల వెంకటస్వామి, పార్టీ మండల ప్రధానకార్యదర్శులు జాలిగం రమేష్, పిల్లి నర్సయ్య, మండల కార్యదర్శి గాజుల వేంకటేశ్వర్లు, జిల్లా నాయకులు చిగురు రాజిరెడ్డి, ఎడమల రాజు, ఎనిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.


రాయపోల్: మండలంలోని వడ్డెపల్లిలో ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

● **దౌల్తాబాద్:** బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా గొడుపల్లిలో ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఏవైఎం అధ్యక్షుడు బుర్రరాజగౌడ్, బీజేవైఎం కోర్డినేటర్ మధు, చిక్కుడు స్వామి, బీజేవైఎం అధికార ప్రతినిధి రవీందర్, నాయక్, చంద్రం, కనకరాజు, శివ, మల్లేశం, సాయిరాం,రాజు, శ్రీకాంత్, నర్సింహులు, అనిల్, తిరుపతి, భారత్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు


కొండపాక: డీఈవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఈవోలు

ములుగు, ఏప్రిల్ 30: మండలంలో పదోతరగతి విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించారు. ములుగు గురుకుల పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థినిలు మనోగని, కాయితి నవ్య, కడపల విష్ణు భవాని, నందిని, చిట్యాల సౌమ్య 9.7 జీపీఏ సాధించినట్లు ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

● **మద్దూరు:** మండలంలో పదోతరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో దేశిరెడ్డి తెలిపారు. మద్దూరులోని మోడల్‌స్కూల్‌లో నలుగురు విద్యార్థినిలు బొప్పె ప్రణీత, ఎర్రమల్ల అఖిల, తౌట హర్షిత, అర్జుల ప్రసన్న 10/10 జీపీఏ సాధించారని తెలిపారు.

● **చేర్యాల:** చేర్యాల మండలంలో 99.12శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చేర్యాల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముస్త్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన ఊట్లపల్లి రాజేశ్ 10జీపీఏ సాధించినట్లు తెలిపారు. కొమురవెల్లి మండలంలో 169మంది విద్యార్థులకు 168మంది ఉత్తీర్ణత సాధించారు. కొమురవెల్లి కస్తూర్బా, గురువన్నపేట, ఐనాపూర్ జడ్పీఎస్ఎస్‌లు వందశాతం, మండలకేంద్రంలోని జడ్పీఎస్ఎస్ 98శాతం ఉత్తీర్ణత సాధించింది.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** మిరుదొడ్డి మోడల్‌స్కూల్ చెందిన సాయిశృతి, చందనలు 10/10 జీపీఏను సాధించారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ భారతి విద్యార్థులను అభినందించారు. అలాగే మండలంలోని 552 విద్యార్థులకు గాను 551 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

● **కుకునూరుపల్లి:** పదోతరగతి ఫలితాలలో కుకునూరుపల్లి మండల విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. 195 విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 194 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 10 మంది విద్యార్థులు 10కి 10 జీపీఏ సాధించారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

● **దూళిమిట్ట:** పదోతరగతి ఫలితాల్లో మండలంలోని బైరాన్‌పల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కూటిగల్ గ్రామానికి చెందిన ధరావత్ గణేష్ 10 జీపీఏ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీనాంజనేయులు తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు 9.7, ఒక్కరు 9.5, ఇద్దరు 9.3, ఐదుగురు 9.2, ఐదుగురు 9.0 పాయింట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

● **మర్కుక్:** పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మర్కుక్ మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థిని పూజిత 9.8 జీపీఏతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాలకు చెందిన నేహ 9.7 జీపీఏతో ద్వితీయ స్థానం దక్కించుకుంది. చేబర్తి, దామరకుంట, పాములపర్తి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● **కొండపాక:** పదో తరగతిలో ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ముబీన్‌ను, పాఠశాల హెచ్ఎం భైరయ్యను మంగళవారం మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ రజిత విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. కొండపాక పాఠశాలలో చదువుతున్న వైష్ణవి 10 జీపీఏ సాధించింది. వైష్ణవిని తెలంగాణ జాగృతి నాయకుడు అనంతుల ప్రశాంత్ శాలువాతో సత్కరించి పదివేల నగదు అందజేశాడు. పదో తరగతి పరీక్షల్లో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలో రెండో స్థానం సాధించడంతో డీఈవో శ్రీనివాసరెడ్డిని ఎంఈవోలు మంగళవారం కలిసి అభినందించారు. కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట అర్బన్ ఎంఈవో యాదవరెడ్డిలతో పాటు పలువురుపుష్పగుచ్ఛం అందజేశారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన అంబిటస్ స్కూల్


పది జీపీఏ పాయింట్లను చూపుతున్న అంబిటస్ విద్యార్థులు

సిద్దిపేట క్రైం: సిద్దిపేట పట్టణంలోని అంబిటస్ స్కూల్ విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. 84 మంది విద్యార్థులకు 84 మంది (100శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 8 మంది విద్యార్థులు 10 జీపీఏ పాయింట్లు, 12 మంది విద్యార్థులు 9.8 పాయింట్లు, 64 మంది విద్యార్థులు 9 పాయింట్ల పైగా సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు.